# అక్షరాంజలి

పద్మ

## హైడి

### -జోహాన్నా స్పైరి

చిన్నపిల్లలకు ఎటువంటి కథలు చెప్పాలన్న విషయంలో అనేక వాదోప వాదాలున్నాయి. ఏకాభిప్రాయం లేదు. కానీ జోహాన్నా స్పైరి రచించిన 'హైడి' నవల, బాలల సాహిత్యంలో అగ్రస్థానం ఆక్రమిస్తుందన్న విషయంలో మాత్రం ఎటువంటి వాదనలు, సందేహాలు లేవు. కొండలపై నుండి దూకే జలపాత ప్రవాహంలోని స్వచ్ఛత, ఆకాశంలో విరిసే హరివిల్లును చూసి కేరింతలు కొట్టే పక్షి తతులలోని స్నిగ్ధత, చిరుగాలికి తలలూపుతూ, ముద్దులొలికే అందంతో పరిమళించే పూలలోని మార్దవం, మునుల్లా నిశ్చలంగా నిలచిన పర్వతతతులలోని గాంభీర్యం, సకల ప్రకృతిలో అంతర్గతంగా పరిఢవిల్లే భగవద్ధ్యానం వంటివన్నీ కుప్పబోసి కలగలిపితే ఏర్పడేదే 'హైడి' నవల. పిల్లలు సాహసకృత్యాలు చేయాలని, పెద్దలకు బుద్ధులు చెప్పాలని, పిల్లల సాహిత్యంలో నీతి బోధలుండాలని రకరకాల సిద్ధాంతాలను ఏర్పరచి, పట్టుకుని వేలాడే వారందరికీ అసలుసిసలైన బాల సాహిత్యాన్ని రుచిచూపించి మెప్పిస్తుంది 'హైడి.'

స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్ వద్ద ఉన్న ఓ గ్రామం హిర్జెల్. ఆ గ్రామంలో 1829లో జోహానా హెస్సెర్ జన్మించింది. ఆమె తండ్రి వైద్యుడు. ఆరుగురు పిల్లల్లో జోహానా ఒకర్తె. అందమైన ప్రకృతి ఒడిలో బాల్యం గడిపింది. ఓ వైపు మంచుతో నిండిన ఆల్ప్స్ పర్వతాలు, మరోవైపు ఆ పర్వతాలను అద్దంలో ప్రతిబింబించే జ్యూరిచ్ సరస్సు, పర్వత పాదాల వెంబడి, పరచిన పూల తివాచీలు ఇవన్నీ చూస్తూ ఎంతో హాయిగా ఆనందంగా ఆమె బాల్యం గడిపింది. 1852లో బెర్న్‌హార్డ్ స్పైరి అనే లాయర్‌ను వివాహమాడింది. దాంతో ఆమె పేరు జోహాన్నా స్పైరిగా మారింది. అతడూ జ్యూరిచ్‌కు చెందిన వాడు కావటంతో ఆమె ప్రకృతికి దూరం కాలేదు. కానీ బాల్యంలో స్వేచ్ఛగా పర్వతాలు ఎక్కటం, పశువులను కాస్తూ, పూలతివాచీపై పడుకుని, ఆకాశంలో మారే రంగులను చూస్తూండటం వంటి మధుర స్మృతులు ఆమెని బాధిస్తుండేవి. ఇదే సమయంలో వారికి డబ్బు అవసరం అయింది. డబ్బు సంపాదించడం కోసం చిన్న చిన్న కథలు రాసి పత్రికలకు అమ్మటం ఆరంభించింది జోహానా. అలా రాసిన నవల 'హైడి'.

'హైడి' నవల చదువుతూంటే మనకు అనేక సినిమాలు గుర్తుకు వస్తాయి. ఇంకా బోలెడన్ని నవలలు మదిలో మెదలుతాయి. కానీ 'హైడి' నవల రచన కాలం 1880లోనని గ్రహిస్తే, ప్రపంచ వ్యాప్తంగా ఎంతమంది సృజనాత్మక కళాకారులకు ఈ నవల ప్రేరణగా నిలిచిందో అర్థమవుతుంది. 'హైడి' నవలలో విలన్లు లేరు. మానవుడిలోని దౌష్ట్య ప్రదర్శన లేదు. హత్యలు, హంతకులు కనబడరు. మోసాలు, ద్వేషాలు మచ్చుకి కూడా ఉండవు. ఎటువంటి ఉద్విగ్నతలు, ఉపన్యాసాలు, ఏడుపులు, పెడబొబ్బలు లేవు. కేవలం పసిపిల్లల అమాయకత్వం, బాల్యంలోని కుతూహలం, ఆలోచనలు నవలలో అత్యద్భుతమైన రీతిలో ప్రదర్శితమవుతాయి.

అయిదేళ్ల 'హైడి'ని వాళ్ల తాతయ్య దగ్గర దింపేందుకు తీసుకువెళ్తూండటంతో నవల ఆరంభమవుతుంది. 'హైడి' తల్లి తండ్రి చిన్నప్పుడే మరణిస్తారు. అనాథగా ఉన్న 'హైడి'ని వాళ్ల పిన్ని చేరదీస్తుంది. కానీ ఉద్యోగరీత్యా ఆమె ఓ రెండేళ్లు వేరే ప్రదేశం వెళ్లాల్సి వస్తుంది. దాంతో 'హైడి'ని వాళ్ల తాతయ్య దగ్గర ఉంచేందుకు 'డోర్ఫ్లి'కి తీసుకువస్తుంది.

'హైడి' తాతయ్య ఓ విచిత్రమైన మనిషి. ఆయన ఊళ్లో ఎవరితో కలవడు. ఊరికి దూరంగా ఓ కొండ శిఖరంపైన ఇల్లు కట్టుకుని ఉంటూంటాడు. ఎప్పుడో, ఏదో అవసరమైతే తప్ప కొండ దిగి రాడు. ఎవరితో మాట్లాడడు. ఎవరినీ దగ్గరకు రానివ్వడు. చర్చికి రాడు. మత పెద్ద మాటలు వినడు. దాంతో అతడి గురించి రకరకాల వదంతులు ప్రచారంలో ఉంటాయి. క్రూరుడు, కర్కోటకుడు అని అందరూ భయపడుతూంటారు. ఇప్పుడు అతడి వద్ద ఉంచేందుకు 'హైడి'ని తీసుకువెళ్తూంటుంది పిన్ని.

మొదటి అధ్యాయంలోనే ఈ విషయాలన్నీ మనకు తెలుస్తాయి. దాంతో ఆ కర్కోటకుడి దగ్గర 'హైడి' ఎన్ని బాధలు పడుతుందోనన్న సానుభూతి పాఠకుడికి కలుగుతుంది. ఇదే సందేహం ఓ పాత్ర వ్యక్తపరుస్తుంది. 'హైడి చిన్నపిల్లే అయినా బోలెడన్ని తెలివితేటలున్నాయి. అది నెట్టుకొచ్చేస్తుంది' అంటుంది పిన్ని. అప్పుడే హైడి కొండల్లో తనకు అన్ని బట్టలు అవసరం లేదని బట్టల మూటను పక్కన పడేసి, బూట్లు విసిరేసి నవ్వుతూ, తుళ్లుతూ కొండ ఎక్కేస్తూంటుంది.

పాఠకుడికి 'హైడి' ప్రత్యక్ష పరిచయంగా ఇదే మొదటిసారి అయినా, ఈ సంఘటనతో 'హైడి' అంటే ప్రత్యేక అభిమానం ఏర్పడుతుంది. ఒక రకంగా చూస్తే ఆరంభంలోనే 'హైడి' పాఠకుడి మనసు దోచేస్తుంది. నవల సాంతం పాఠకుడు ఉత్సాహంగా చదివేట్టు చేస్తుంది.

కొండ ఎక్కుతూంటేనే 'హైడి'కి 'పీటర్' పరిచయమవుతాడు. అతడు గొర్రెల కాపరి. 'హైడి'ని తాతయ్య దగ్గరకు తెచ్చి వదిలేస్తుంది పిన్ని. అందరూ ఊహించినట్టు 'హైడి' తాతయ్య అంటే భయపడదు. తాతయ్య సైతం 'హైడి'ని ఏమీ అనడు. ప్రేమగా చూస్తాడు. 'హైడి'కి పక్క ఏర్పాటు చేస్తాడు. అక్కడ గోడకి ఓ రంధ్రం ఉంటుంది, ఆ రంధ్రంలోంచి కొండలను చూస్తూ పడుకుంటుంది 'హైడి'. రాత్రంతా, ఆమె వదనంపై ప్రతిఫలిస్తున్న వెన్నెలను చూస్తూ కూచుంటాడు తాతయ్య.

తెల్లారి లేవగానే పీటర్‌తో పాటు గొర్రెలను మేపేందుకు బయలుదేరుతుంది. నవలలో అత్యద్భుతమైన దృశ్యం ఇది. ప్రకృతిని పసిపిల్ల దృష్టిలో చూసి అత్యంత సృజనాత్మకంగా రచయిత్రి వర్ణించిన తీరు మనల్ని ముగ్ధుల్ని చేస్తుంది. అలాంటి పర్వతశ్రేణుల నడుమకు మానసికంగా మనల్ని తీసుకువెళ్తుంది. సూర్యాస్తమయం చూసి రాళ్లన్నీ అగ్నికి ఆహుతి అవుతున్నాయని అనుకుంటుంది. తనపై పడిన మంచు ముక్కతో మాట్లాడుతుంది. 'ఈ రాత్రికి ఇక్కడే నిదురపో. ఏడవకు. మళ్లీ రేపుపొద్దున్న నేను వస్తాగా. అప్పుడు ఆడుకుందాం' అని కురుస్తున్న మంచు రేణువులకు వాగ్దానం చేస్తుంది. పూలతో ఆడుకుంటుంది. ఇంటికి తిరిగి వచ్చి తన అనుభవాలను తాతయ్యతో పంచుకుంటుంది.

తాను కోసినప్పుడు తాజాగా నవనవలాడుతూండే పూలు సాయంత్రానికల్లా వాడిపోవటం చూసి దుఃఖిస్తుంది. 'అవి సూర్యుడి వేడిలో ఆనందించాలనుకుంటూంటే నువ్వు కోసి వాటిని బట్టలో బంధించావు. వాడిపోక ఏం చేస్తాయి?' అంటాడు తాతయ్య. అంతే. ఇక పూలు కోయనని, వాటిని చూసి ఆనందిస్తానని అనుకుంటుంది హైడి. ఎంత సున్నితమైన ఆలోచనను పిల్లల మెదళ్లలో కలిగిస్తోందో రచయిత్రి! 'మరి గ్రద్ధ ఎందుకు

మీకు నచ్చిన మంచి నవలల గురించి మీరూ ఈ పేజీల్లో రాయవచ్చు. ఇలాగే మొత్తం నవలని పరిచయం చేయగలిగితే నాలుగు అరఠావులు మించకుండా పేజీకి ఒకవైపే రాసి పంపండి. అమ్మో, అంత రాయలేం అనిపిస్తే మీకు నచ్చిన పుస్తకం గురించి ఒక అరఠావు పేజీ రాసి పంపించండి. చిరునామా తెలుసుగా. కవరుమీద 'అక్షరాంజలి' అని రాయడం మరిచిపోకండి.

కొండమీద నుంచి అరుస్తోంది?" మీ పనులను మీరు సక్రమంగా చేసుకుంటూ అప్పుడప్పుడు కొండ ఎక్కి ప్రకృతిని చూసి ఆనందించటం మాని మీలో మీరు కొట్టుకుంటున్నారు పిచ్చివాళ్లలారా!' అని అరుస్తోందని అంటాడు తాతయ్య.

'కొండమీద మంట' గురించి అడుగుతుంది హైడి. 'సూర్యుడు కొండలకు గుడ్‌నైట్ చెప్తున్నాడు. పర్వతాలపై అందమైన వెలుతురు దుప్పటిని కప్పుతున్నాడు. ఆ దుప్పటి వెచ్చదనంలో పడుకుని రాత్రంతా తనని గుర్తుంచుకోమని, తెల్లారే తాను వచ్చేస్తానని చెప్తున్నాడు' అని వివరిస్తాడు తాతయ్య. నవలలో ఈ అధ్యాయం అత్యంత సృజనాత్మకంగా ఉంటుంది. పిల్లల ఊహలకు రెక్కలిస్తుంది. పెద్దల మనసులు ఆనందంతో నృత్యం చేసేట్టు చేస్తుంది. పిల్లల సందేహాలకు, వారిలో ఆలోచనలు రేకెత్తించే రీతిలో పెద్దలు సమాధానాలు చెప్పాలని రచయిత్రి సూచిస్తుందీ అధ్యాయంలో.

హైడికి, పీటర్‌కి నడుమ మంచి దోస్తీ ఏర్పడుతుంది. పీటర్ అమ్మమ్మ గుడ్డిది. ఆమెకి ఏమీ కనబడదని తెలిసి హైడి ఏడుస్తుంది. ఈ సంఘటనలో 'హైడి' అమాయకత్వానికి హృదయం ద్రవిస్తుంది. 'హైడి' మాట కాదనలేక తాతయ్య వచ్చి పీటర్ ఇంటిని రిపేర్ చేస్తాడు. ఇంతలో 'చలికాలం' వస్తుంది. మంచు కురవటాన్ని, కొండలు, ఇళ్లు, వాకిళ్లు మంచులో కప్పుకుపోవటాన్ని 'హైడి' ఆలోచనలను అద్భుతంగా వర్ణిస్తుంది రచయిత్రి.

ఇలా హాయిగా ఆడుతూ పాడుతూ గడుస్తున్న 'హైడి' జీవితంలోకి పిన్ని మళ్లీ ప్రవేశిస్తుంది. ఓ ధనవంతుల ఇంట్లోని అమ్మాయికి సహచరి కావాలని 'హైడి'ని తీసుకువెళ్తుంది. తాతయ్య మాట్లాడడు. హైడికి ఏమీ అర్థం కాదు. దాంతో ఉత్సాహంగా ప్రయాణమవుతుంది.

'హైడి'కి ధనవంతుల ఇంట్లో ఊపిరి అందదు. ఆకాశంలో ఎగిరే పక్షిని అందాల పంజరంలో బంధించినట్లుంటుంది. అయితే అక్కడ ఉన్న అమ్మాయి 'క్లారా' నడవలేదు. 'వీల్‌చైర్'కే పరిమితం అయి ఉంటుంది. ఆమెతో 'హైడి'కి అనుబంధం ఏర్పడుతుంది. హైడి అంటే క్లారాకు అభిమానం ఏర్పడుతుంది. హైడి స్వేచ్ఛ ప్రవర్తన ఇంట్లోని ఆయనకు నచ్చదు. ఓ రోజు హైడి తలుపు తీసుకుని బయటకు వెళ్లి ఊరు చుట్టి వస్తుంది. వస్తూ బోలెడన్ని పిల్లిపిల్లలు పట్టుకు వస్తుంది. ఆ పిల్లుల్తో ఇంట్లో జరిగిన హంగామా నవ్వు కలిగిస్తుంది.

'క్లారా' ప్రేమగా చూస్తున్నా 'హైడి'కి పర్వతాలు, పూలు, మంచు గుర్తుకు వస్తుంటాయి. పైగా 'ఆయా' నిబంధనలు ఆమెని బాధిస్తుంటాయి. టీచర్ ఎంత చెప్పినా ఆమెకి చదువు అబ్బదు. ఓ రోజు 'క్లారా' అమ్మమ్మ ఇంటికి వస్తుంది. 'హైడి' పరిస్థితిని అర్థం చేసుకుంటుంది. పర్వతాల బొమ్మలున్న పుస్తకాలిస్తుంది. ఎన్ని రోజులు కష్టపడ్డా ఒక్క అక్షరం ముక్క నేర్చని హైడి, ఆ పుస్తకంలోని అంశాలు చదవాలన్న ఆత్రంతో చదువు నేర్చుకుంటుంది. పిల్లలకు బలవంతాన నేర్పేకన్నా వారి ఆసక్తిని గమనించి, ఆ ప్రకారం వారికి చదువు నేర్పాలన్న ఆలోచననిస్తుంది రచయిత్రి.

మళ్లీ తాతయ్య దగ్గరకు వెళ్లిపోవాలన్న 'హైడి' ప్రగాఢ వాంఛను నాయనమ్మ అర్థం చేసుకుంటుంది. దేవుడిని ప్రార్థించమంటుంది. రెండు రోజులు ప్రార్థించి 'తన' కోరిక నెరవేరలేదు కాబట్టి దేవుడు లేడంటుంది హైడి. అది తప్పని బోధిస్తుంది నాయనమ్మ. దేవుడు అందరి ప్రార్థనలను వింటాడని, కానీ ఎవరికి ఏ సమయంలో, ఏది అందాలో, ఆ సమయంలో వారికి దాన్ని అందజేస్తాడని, అంతవరకూ ఆత్రపడకుండా దేవుడిని ప్రార్థిస్తూనే ఉండాలని బోధిస్తుంది. ఈ మాటలు 'హైడి'పై అత్యంత ప్రభావం చూపిస్తాయి. కానీ 'హైడి' మనసును పర్వతాలపై పరుగెత్తాలన్న ఆలోచన మాత్రం వదలదు.

'హైడి' ఆరోగ్యం క్షీణిస్తుంటుంది. ఆమె నిద్రలో నడవటం మొదలుపెడుతుంది. ఒకవైపు 'హైడి' పరిస్థితి పట్ల పాఠకుడి మనసులో వేదన కలుగుతూంటుంది. మరోవైపు రాత్రి నడిచే హైడిని చూసి 'దయ్యం' అనుకొని ఇంట్లో వాళ్లు భయపడటాన్ని వర్ణించి నవ్విస్తుంది రచయిత్రి. 'హైడి' పరిస్థితిని అర్థం చేసుకున్న డాక్టర్ ఆమెని తాతయ్య దగ్గరకి పంపేయమంటాడు.

మళ్లీ హైడి జీవితంలో ఆనందం ప్రవేశిస్తుంది. ప్రకృతి ఒడికి చేరుతుంది హైడి. 'హైడి'ని వదలలేని 'క్లారా' కూడా అక్కడికి వస్తుంది. 'హైడి' తన కన్నా 'క్లారా'తో ఎక్కువ మాట్లాడటం భరించలేని పీటర్ క్లారా 'వీల్‌చైర్'ని కొండ మీద నుంచి తోసేస్తాడు. దాంతో తప్పనిసరి పరిస్థితుల్లో 'క్లారా' నడవాల్సి వస్తుంది. నడుస్తుంది. ఆ వాతావరణంలో 'క్లారా' ఆరోగ్యం బాగయిపోతుంది.

తను చేసిన పనికి కుములుతున్న పీటర్ నిజం చెప్పి క్షమార్పణలు వేడుకుంటాడు. 'దేవుడు అన్నీ చూస్తుంటాడు. మనం ఎవ్వరూ చూడకుండా పనులు చేస్తున్నామనుకుంటాం. కానీ మనలో మనస్సాక్షి రూపంలో దేవుడు మనల్ని గమనిస్తుంటాడు. తప్పు చేస్తే శిక్షిస్తాడు' అని పీటర్‌కి పెద్దలు చెపుతారు.

'క్లారా'ని చూసి ఆమె తల్లిదండ్రులు సంతోషిస్తారు. హైడి వల్ల తాతయ్య కూడా మారతాడు. దైవాన్ని నమ్మడం ఆరంభిస్తాడు. చర్చికి వెళ్తాడు. దాంతో ఊళ్లో వాళ్లు తాతయ్యని ఆదరిస్తారు. అలా అందరూ కలసి హాయిగా బ్రతకటంతో కథ పూర్తవుతుంది. నవలలో అడుగడుగునా రచయిత్రి ప్రదర్శించిన సున్నితత్వం, సృజనాత్మకత, బాలుర మనస్తత్వం పట్ల ఆమె చూపిన అవగాహన, ఆలోచనలను నవలను ఉన్నత స్థాయికి ఎలివేట్ చేస్తాయి. ప్రతి వ్యక్తిలో నిద్రాణంగా ఉన్న బాలుడిని తట్టి లేపి ఆనందింపజేస్తాయి.

1880లో ప్రచురితమవుతూనే సంచలనం సృష్టించింది 'హైడి' నవల. జర్మన్ భాషలో రచించిన ఈ నవల వెంటవెంటనే 13 ముద్రణలకు నోచుకోవటం ఓ అద్భుతం. 1884లో ఇంగ్లీషులోనికి అనువదితమవుతూనే ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. 'హైడి' నవలతో ప్రభావితమై అనేక చిత్రకారులు నవలకు బొమ్మలు వేసి తమ సృజనాత్మకతకు మెరుగులు దిద్దుకున్నారు. చార్లెస్ ట్రిట్టెన్ అనే కళాకారుడు బొమ్మలు వేయటంతో సంతృప్తి పడక 'హైడి గ్రోస్ అప్', 'హైడాస్ చిల్డ్రన్' వంటి నవలలు రాసి 'హైడి' ప్రభావానికి నివాళులు అర్పించారు.

'హైడి' నవలకు లభించిన ఆదరణతో అనేకులు జోహానాను ఆమె జీవిత చరిత్ర రాయమని కోరారు. కానీ 'నా బాహ్య జీవితంలో అంతగా చెప్పుకోదగ్గ అంశాలు లేవు. మా అంతరంగాన్ని ఏమని వర్ణించాలి?' అని సున్నితంగా తప్పుకుంది. కానీ 'హైడి' నవల జోహానా బాల్యానుభూతులను ప్రతిబింబిస్తుందన్నది నిర్వివాదాంశం.

'హైడి' నవల ద్వారా ప్రపంచాన్ని ఉర్రూతలూగించిన జోహాన్నా జీవితం విషాదంతో ముగిసింది. ఆమె కళ్ల ముందే 29 ఏళ్ల అబ్బాయి మరణించాడు. వెంటనే ఆమె భర్త మరణించాడు. ఆ విషాదంలో 1901లో జోహానా మరణించింది. జోహానా యాభై పైగా నవలలు రాసినా ఈనాటికీ ఆమె 'హైడి' రచయిత్రిగానే గుర్తింపు పొందుతోంది.

రచయిత తన అంతరంగంలోని అనుభవాలను అక్షరరూపంలో ప్రదర్శిస్తే జాతి, కులం, మతం, ప్రాంతం, భాష, కాలాలతో సంబంధం లేకుండా ఆ రచన సార్వజనీనతను సంతరించుకుని అనంతకాలం ప్రజలను ఉర్రూతలూగిస్తుందని జోహానా స్పైరి రచించిన 'హైడి' నిరూపిస్తుంది. ఈనాటికే కాదు ఏనాటికైనా పిల్లలు, పెద్దల సృజనాత్మకతకు పదును పెడుతూనే ఉంటుంది 'హైడి'.